సాక్షి
వనపర్తి
శుక్రవారం | 3 | మార్చి | 2023



అయోమయంలో..
కొల్లాపూర్ మండలం ఎర్రగట్టు బొల్లారం గ్రామస్తులు అయోమయంలో జీవిస్తున్నారు.
వివరాలు 8లో ▸



ఉత్సవాలకు ముస్తాబు
మన్యంకొండ అలివేలు మంగతాయారు దేవస్థానం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది.
వివరాలు 10లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
36.0 /19.3
తెల్లవారుజామున చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఆకాశం నిర్మలంగా ఉండి ఉక్కపోసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పరీక్షలకు హాజరుకావాలి

వనపర్తిటౌన్: ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష ఉంటుందని.. జిల్లాలోని ప్రభుత్వ, రెసిడెన్షియల్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులు విధిగా హాజరుకావాలని డీఐఈఓ జాకీర్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీన సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఉంటుందన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



ఆత్మకూర్: పదోతరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి రూ.కోట్లు మంజూరు చేస్తోందని తెలిపారు. మన ఊరు – మన బడి పథకంలో భాగంగా పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలతో పాటు మౌలిక వసతులు కల్పిస్తోందని వివరించారు. పదోతరగతి విద్యార్థులకు రోజు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రేరణ తరగతులను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు.

పట్టుదలతో చదవాలి..

అమరచింత: పదోతరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులతో పాటు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని డీఈఓ రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నాగల్‌కడ్మూర్, అమరచింత బాలికల ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు ప్రారంభించి మాట్లాడారు. పుస్తకాన్ని తలవంచి చూస్తే అది నిన్ను భవిష్యత్‌లో తలెత్తుకొనే వ్యక్తులుగా సమాజానికి పరిచయం చేస్తోందని.. ఈ విషయాలను ఎందరో మేధావులు చెప్పారన్నారు. గొప్పగొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలను తెలుసుకోవాలని.. అప్పుడే వారు ఎంతటి ధృడ సంకల్పంతో లక్ష్యాలను సాధించారనే విషయాలను తెలుసుకోవచ్చని వివరించారు. ఎంఈఓ భాస్కర్‌సింగ్, జీహెచ్‌ఎం కరుణాకర్, హెచ్‌ఎం బలరాముడు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే క్షయ నివారణ



అమరచింత: అప్రమత్తతతోనే క్షయను నివారించే అవకాశం ఉందని టీబీ ప్రోగ్రామ్ జిల్లా అధికారి డా. సాయినాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం డీఎంఆర్‌ఎం ట్రస్టు ద్వారా టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. దగ్గు ఎక్కువ రోజుల పాటు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే నివారణకు చికిత్స పొందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మాత్రలను ఆరునెలల పాటు వినియోగిస్తే త్వరగా కోలుకుంటారని తెలిపారు. టీబీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఆరునెలల పాటు రూ.500 అందిస్తుందని.. దీంతో పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. డీఎంఆర్‌ఎం ట్రస్ట్ చైర్మన్ దేశాయి ప్రకాష్‌రెడ్డి ఉచితంగా పౌష్టికాహారం అందించడం అభినందనీయమని కొనియాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్‌ఏ రాజు, కంటివెలుగు జిల్లా కో–ఆర్డినేటర్ డా.పరిమళ, డా. తులసి, డా. నిస్సార్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు కలాం పాషా, జిల్లా కమిటీ సభ్యుడు శ్యామ్, హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.7,777

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం వేరుశనగకు గరిష్ఠంగా రూ.7,777, కనిష్ఠంగా రూ.3,329 ధరలు లభించాయి. అదేవిధంగా మొక్కజొన్నకు రూ.2,208, శనగలు రూ.4,711, మినుములు గరిష్ఠంగా రూ.7,210, కనిష్ఠంగా రూ.7,170, కందులు గరిష్ఠంగా రూ.7,779, కనిష్ఠంగా రూ.6 656, ఆముదాలు గరిష్ఠంగా రూ.6,370, కనిష్ఠంగా రూ.5,940, పెబ్బర్లు గరిష్ఠంగా రూ.5,669, కనిష్ఠంగా రూ.4,701 ధరలు లభించాయి. దేవరకద్ర మార్కెట్ యార్డులో ఈనామ్ టెండర్లలో ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.6,231, కనిష్ఠంగా రూ.6,109గా నమోదయ్యాయి.

ప్రకృతి వనాలేవీ?



జిల్లాకేంద్రంలోని రాంనగర్‌లో ఏర్పాటైన పట్టణ ప్రకృతి వనం

- పురపాలికల్లో వేధిస్తున్న స్థలాల కొరత
- జిల్లాకేంద్రంలో పలుచోట్ల ఉన్న పార్కుల పేర్లే మార్పు
- ప్రైవేట్ స్థలాల కొనుగోలుకు చొరవ చూపని అధికారులు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



జిల్లాకేంద్రంలోని ఏనుగులబొంద పార్కుకు పట్టణ ప్రకృతివనం బోర్డు ఏర్పాటు

వనపర్తిటౌన్: యాంత్రిక జీవనానికి అలవాటు పడిన పుర ప్రజలు కాలుష్యంతో కొట్టుమిట్టాడుతుండటంతో ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు ప్రతి వార్డులో పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ జిల్లాలోని పురపాలికల్లో వీటి ఏర్పాటులో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదు. పెబ్బేరు, ఆత్మకూర్ పురపాలికల్లో కాస్త మెరుగ్గా ఉన్నా.. వనపర్తి, కొత్తకోట, అమరచింత మున్సిపాలిటీలు వెనుకబడ్డాయి. స్థలాల కొరత, ప్రైవేట్ స్థలాల కొనుగోలుపై అశ్రద్ధ, భూ కబ్జాలను అరికట్టకపోవడంతో ప్రక్రియ మరుగునపడినట్లయింది. పట్టణ ప్రగతి నిధులతో ప్రతి వార్డులో ప్రకృతి వనం ఏర్పాటు చేయాల్సి ఉంది.

సమష్టి కృషితోనే..

అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే పట్టణాలు పచ్చదనంతో కళకళలాడే అవకాశం ఉంది. ఇప్పటి వరకు హరితహారం, పట్టణప్రగతిలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రణాళికలు రూపొందించాలి. అవి పెరిగితేనే ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం, స్వచ్ఛమైన గాలి అందే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు చొరవ చూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

స్థలాల కొరతే సమస్య..



పట్టణ ప్రకృతి వనాలను ప్రతి వార్డులో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాం. జిల్లాకేంద్రంలో వీలైనన్ని వార్డుల్లో ఏర్పాటు చేశాం. స్థలాల కొరత కారణంగా ఆశించిన స్థాయిలో లక్ష్యం చేరలేదు. ప్రైవేట్ స్థలాల కొనుగోలు అంశం కౌన్సిల్ నిర్ణయంతో ముడిపడి ఉంటుంది.
– విక్రమసింహారెడ్డి, పుర కమిషనర్, వనపర్తి

ఇవీ నిబంధనలు..

పురపాలికల్లోని ప్రతి వార్డులో ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఒక్కో వనాన్ని ఎకరం స్థలం.. స్థలాల సమస్య ఉంటే కనీసం 100 గజాల స్థలంలోనైనా ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రభుత్వ స్థలాలు లేకుంటే ప్రైవేట్ వ్యక్తుల నుంచి కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ జిల్లాలో వనాల ఏర్పాటుకు స్థలాల సమస్య తీవ్రంగా ఉందని అధికారులు చెబుతున్నారు. కనీసం ప్రైవేట్ వ్యక్తుల నుంచి కొనుగోలు చేసేందుకు పుర అధికారులు దృష్టి సారించకపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వనాల ఏర్పాటు కలగానే మారుతోంది.

పురపాలికల వారీగా ఇలా..

- జిల్లాకేంద్రంలో పట్టణ ప్రకృతి వనాల ఏర్పాటు అధ్వానంగా మారింది. 33 వార్డులు ఉండగా.. గతంలో నిర్మించిన పార్కులతో కలిపి 22 ఉన్నాయి. ఇందులో కొత్తగా రాజనగరం, నర్సింగాయపల్లి, మర్రికుంట హౌసింగ్‌బోర్డు కాలనీ, నాగవరం, రాంనగర్ కాలనీల్లో ఏర్పాటు చేశారు. మిగతా వార్డుల్లో గతంలో ఉన్న పార్కులకే పట్టణ ప్రకృతి వనాలు అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. స్థలాల కొరత ఉందని చెబుతున్నారే తప్పా.. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకపోవడంతో లక్ష్యం నీరుగారుతోంది. 11 వార్డుల్లో ప్రకృతి వనాల ఊసే లేకపోవడం గమనార్హం.
- కొత్తకోట మున్సిపాలిటీలో 15 వార్డులుండగా 9 పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో 6 పూర్తి కాగా.. మిగిలిన మూడింటి పనులు తుది దశలో ఉన్నాయి.
- పెబ్బేర్ పురపాలికలో 12 వార్డులు ఉన్నాయి. 10 వార్డుల్లో పట్టణ ప్రకృతి వనాల ఏర్పాటు పూర్తయ్యాయి. స్థలాల కొరత కారణంగా 1, 3 వార్డుల్లో ఏర్పాటు కాలేదు.
- ఆత్మకూర్ మున్సిపాలిటీలో 10 వార్డులు ఉండగా.. 7 వార్డుల్లో వనాల ఏర్పాటు పూర్తి కాగా.. మిగిలిన మూడింటిలో స్థలాల గుర్తింపు పూర్తికాకపోవడంతో నిలిచిపోయాయి.
- అమరచింత మున్సిపాలిటీలో 10 వార్డులు ఉన్నాయి. ఒకవార్డులో మాత్రమే పనులు తుదిదశలో ఉండగా.. మరో వార్డులో నిర్మాణానికి పూనుకున్నారు. మిగిలిన 8 వార్డుల్లో స్థలాల కొరత కారణంగా పనులు ప్రారంభించలేదని అధికారులు చెబుతున్నారు.

చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే డా. అబ్రహం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

వనపర్తి: బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని నాగవరం శివారులో ఉన్న బీఆర్‌ఎస్ భవన్‌లో బుధవారం రాత్రి పొద్దుపోయే వరకు నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి రెండు మున్సిపాలిటీలు, ఏడు మండలాల్లోని పార్టీ ప్రజాప్రతినిధులు తమ కుటుంబాలతో హాజరుకాగా మంత్రి సతీసమేతంగా హాజరై మాట్లాడారు. అందరం ఓ కుటుంబంలా మెలుగుతూ పార్టీని బలోపేతం చేయాలని కోరారు. 2014కు ముందు.. ప్రస్తుత జరిగిన అభివృద్ధిపై చర్చించాలని, ప్రజాప్రతినిధుల నుంచి ముఖ్య నాయకులు, సామాన్య కార్యకర్తల వరకు అన్నిస్థాయిల్లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించుకుందామన్నారు. ఇందుకు ప్రత్యేక క్యాలెండర్‌ను సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

నిర్లక్ష్యం చేస్తే.. పెద్దమనసు చేసుకోండి..

పని ఒత్తిడిలో ఎవరినైనా నిర్లక్ష్యం చేసి ఉంటే పెద్దమనసు చేసుకోవాలని, నిరంతరం చేసిన కృషి ఫలితమే నేడు దేశంలోనే రాష్ట్రం వ్యవసాయరంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. ఎన్నికల కాలం సమీపిస్తోందని.. ప్రతి చిన్న అంశాన్ని ప్రజలు గమనిస్తుంటారని, వారు మనకంటే చాలా తెలివైన వారనే విషయాన్ని మర్చిపోవద్దని సూచించారు.

ఫిర్యాదుల బాక్స్‌లో వేయండి..

సమస్యలేమైనా ఉంటే నేరుగా కలిసి చెబితే పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. తోటివారి ముందు చెప్పుకోలేని సమస్యలు, విన్నపాలను కాగితంపై రాసి ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్‌లో వేయాలని, స్వయంగా చదివి పరిష్కరిస్తానని చెప్పారు. పార్టీ కార్యాలయం అంటే పవిత్రమైందని.. భోజనం మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

వసతిగృహాల నిర్మాణం త్వరలో పూర్తి

వనపర్తి క్రైం: వనపర్తికి మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలు వస్తాయని ఎవరూ ఊహించలేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన జిల్లాకేంద్రంలోని మెడికల్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నారని వివరించారు. మెడికల్ కళాశాల వసతి గృహాల నిర్మాణం త్వరలో పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. పట్టణం చుట్టూ అందమైన విహార ప్రదేశాలు, చెరువులు ఉన్నాయని, విద్యార్థులు ప్రకృతిని ఆస్వాదించాలన్నారు. కళాశాలలో సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానం చెప్పిన వారికి నగదు బహుమతితో పాటు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అలంపూర్ ఎమ్మెల్యే డా. అబ్రహం, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సునందిని, సూపరింటెండెంట్ డా. నరేంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

రూ. వెయ్యి కోట్ల రుణాలు


- డీసీసీబీ సీఈఓ లక్ష్మయ్య



మాట్లాడుతున్న డీసీసీబీ సీఈఓ లక్ష్మయ్య

అమరచింత: డీసీసీ బ్యాంకు ద్వారా 2021–2022 ఆర్థిక సంవత్సరంలో రైతులకు రూ.వెయ్యి కోట్ల రుణాలు ఇవ్వడంతో పాటు ఈ ఏడాది చేనేత కార్మికులకు గ్రూపు రుణాలు అందిస్తున్నామని డీసీసీబీ సీఈఓ లక్ష్మయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో చేనేత కార్మికులకు బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వ్యవసాయం కోసం రైతులకు రూ.670 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు రూ.200 కోట్లు ఇచ్చామని తెలిపారు. ఈ ఏడాది చేనేత కార్మికులకు జేఎల్‌జీ పథకం ద్వారా గ్రూప్‌కు రెండు లక్షల చొప్పున అందిస్తున్నామని వెల్లడించారు. నలుగురు కార్మికులు గ్రూప్‌గా ఏర్పడి రుణం పొందే అవకాశం ఉందని వివరించారు. అమరచింత మండలంలో చేనేత కార్మికులు అధికంగా ఉన్నారని.. ఇప్పటి వరకు 17 చేనేత గ్రూప్‌లకు రుణాలు అందించామని, మరో ఆరు గ్రూప్‌లకు అందించనున్నట్లు వెల్లడించారు. బ్యాంకు పరిధిలో ఎల్‌టీ రుణమొండి బకాయిలు రూ.90 కోట్లు ఉన్నాయని.. వసూలు చేయడానికి ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. మార్చి 31 వరకు వన్‌టైం సెటిల్‌మెంట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే విదేశాల్లో ఉన్నత చదువులు చదివే రైతుల పిల్లలకు రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ ఆత్మకూర్ బ్యాంకు మేనేజర్ గోపాల్‌గౌడ్, అమరచింత చేనేత వస్త్రాల ఉత్పత్తిదారుల సంఘం సీఈఓ శేఖర్, వగ్గు రామలింగం పాల్గొన్నారు.

తపాలా డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా



వనపర్తిటౌన్: కేంద్ర జీడీఎస్ పీజేఏసీ పిలుపు మేరకు గురువారం వనపర్తి తపాలా డివిజన్ కార్యాలయం ఎదుట జీడీఎస్‌లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వనపర్తి డివిజన్ జీడీఎస్ పీజేఏసీ చైర్మన్ విష్ణు మాట్లాడుతూ.. డీజీ కార్యాలయంలో సాధ్యం కాని టార్గెట్లు ఇచ్చి జీడీఎస్‌లను వేధిస్తూ వారిపై పని ఒత్తిడి పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడీఎస్ ఉద్యోగులు వారికి సాధ్యమైనంత వరకు శక్తివంచన లేకుండా పని చేస్తున్నారని.. తపాల పథకాలు ప్రజలకు వివరించి ఖాతాలు తెరిపించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కచ్చితంగా ప్రతి ఒక్కరితో ఖాతా తెరిపించడం వారి చేతుల్లో లేదన్న విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఈ నెల 16, 17 తేదీల్లో దేశవ్యాప్త సమ్మె నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జీడీఎస్ పీజేఏసీ వనపర్తి డివిజన్ కన్వీనర్ రవీందర్, జీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగునీరు

- కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



కాల్వ నీటికి పూలు చల్లుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: వ్యవసాయరంగానికి పెద్దపీట వేసింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, రైతులకు సాగునీటి కష్టాలు దూరం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని తెల్లరాళ్లపల్లి చెక్‌డ్యాం నుంచి భీమా ప్యాకేజీ–27 కాల్వకు ఎమ్మెల్యే నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన మినీ లిఫ్ట్‌ను ఆయన ప్రారంభించి సాగునీటిని విడుదల చేసి పూలు చల్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని చివరి ఆయకట్టుకు దశలవారీగా సాగునీటిని అందిస్తూ రైతుల కష్టాలు తీరుస్తున్నామని వివరించారు. వీపనగండ్ల మండలం కొర్లకుంటలో పర్యటించినప్పుడు కొర్లకుంట, బొల్లారం రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని చెప్పగా స్పందించి మినీ లిఫ్ట్ ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

మండలంలోని చింతకుంట సర్పంచ్ అనూషతో పాటు పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పార్టీలో చేరికలుపెరుగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, వీపనగండ్ల ఎంపీపీ కమలేశ్వర్‌రావు, కొల్లాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సోంనాథ్‌నాయక్, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రాముయాదవ్, ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, నాయకులు కుమార్‌గౌడ్, రవీందర్‌గౌడ్, తిరుపతయ్య పాల్గొన్నారు.

'కంటివెలుగు' శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కంటివెలుగు శిబిరంలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్

పెబ్బేరు: మండలంలోని గుమ్మడంలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని గురువారం జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహిస్తున్న రెండోవిడత కంటివెలుగును ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని, వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి అద్దాలు, మందులు ఉచితంగా అందిస్తారని వివరించారు. ఆశా కార్యకర్తలు గ్రామంలో ఇల్లిల్లూ తిరిగి అవగాహన కల్పించాలని సూచించారు. సర్పంచ్ సువర్ణ, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటసుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, నాగరాజు, ఆపరేటర్ నిహారిక, ఏఎన్‌ఎం నందిత, రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు రాధ, సువర్ణ, నారాయణమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

కొత్తకోట: ఉపాధ్యాయుల సమస్యలు తీర్చే సంఘం పీఆర్‌టీయూ టీఎస్ అని.. త్వరలోనే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు ఉంటాయని అదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పలు ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, జూనియర్ కళాశాలల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీఆర్టీయూ టీఎస్ బలపర్చిన గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. జీఓనంబర్ 317తో స్థానికత కోల్పోయి ఇతర జిల్లాలకు కేటాయించబడిన ఉపాధ్యాయులందరిని తిరిగి వారి వారి జిల్లాలకు తీసుకురావడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సూర చంద్రశేఖర్, సంఘం నాయకులు భక్తరాజ్, లక్ష్మణ్, బాలరాజు, శ్రీశైలం, సత్యనారాయణ, గోవిందు, గోపాల్ తదితరులు ఉన్నారు.



కొత్తకోటలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

చెక్ డ్యాంలతో రైతులకు మేలు

- మూసాపేట మండలంలో పర్యటించిన పంజాబ్ బృందం



కొమిరెడ్డిపల్లి వద్ద చెక్ డ్యాంను పరిశీలిస్తున్న పంజాబ్ అధికారుల బృందం

అడ్డాకుల: మూసాపేట మండలంలో గురువారం పంజాబ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు సభ్యుల అధికారుల బృందం పర్యటించింది. బలోవాల్ సంక్రీ ఆర్‌ఆర్‌ఎస్ డైరెక్టర్ మన్మోహన్‌జిత్ సింగ్, సాయిల్ అండ్ వాటర్ ఇంజినీరింగ్ శాస్త్రవేత్తలు సంజయ్ సత్పూత్, అబ్‌రార్ యూసుఫ్‌లు పోల్కంపల్లిలో రైతు భీమయ్య పొలంలో ఏర్పాటు చేసుకున్న ఫాంపండ్‌ను పరిశీలించారు. కాల్వ నుంచి వచ్చే నీళ్లను నిల్వ చేయడం వల్ల కలుగుతున్న లాభాలను తెలుసుకున్నారు. ఆ నీళ్లతో కూరగాయలను పండించడంతో పాటు వేసవికాలంలో ఇందులో ఉన్న నీళ్ల పశువులు తాగడానికి ఉపయోగపడతాయని రైతు భీమయ్య పంజాబ్ బృందానికి వివరించారు. అదేవిధంగా పోల్కంపల్లి వద్ద బ్రిడ్జి కింద పెద్దవాగులో ఏర్పాటు చేసిన చెక్‌డ్యాంను పరిశీలించారు. అనంతరం నిజాలాపూర్‌కి వెళ్లి అక్కడ పెద్దవాగులో నిర్మించిన చెక్‌డ్యాంను పరిశీలించారు. చెక్‌డ్యాం నిర్మించక ముందు ఇక్కడి భూగర్భ జలాల పరిస్థితి.. నిర్మించిన తర్వాత పరిస్థితి ఏంటన్నది నీటిపారుదలశాఖ ఎస్‌ఈ చక్రధరంతో తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన మ్యాపులను బృందం పరిశీలించింది. కాగా చెక్ డ్యాం వల్ల ఉపయోగాల గురించి ఎంపీటీసీ సభ్యుడు సీజీ గోవర్ధన్, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహయాదవ్ వివరించారు. తర్వాత కొమిరెడ్డిపల్లి శివారులో పెద్దవాగుపై నిర్మించిన చెక్‌డ్యాంను పరిశీలించారు. చెక్‌డ్యాం పరిసర రైతులతో మాట్లాడారు. చెక్ డ్యాం నిర్మాణాల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతోందని పంజాబ్ బృందం కితాబిచ్చింది. వాగుల్లో నీటి నిల్వ చేయడం ద్వారా సాగు పెరిగి రైతులకు లాభం కలుగుతోందని పేర్కొన్నారు. వారివెంట ఎంపీడీఓ మంజుల, ఇరిగేషన్ డీఈ కృష్ణ, ఏఈ శ్రీనివాసులు, ఏపీఎం పులేందర్, సర్పంచ్ సత్యమ్మ ఉన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని విద్యార్థి బలవన్మరణం


అశోక్ (ఫైల్)

నారాయణపేట: ఉరేసుకుని విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన జిల్లాలోని దామరగిద్ద మండలం కంసాన్‌పల్లి గ్రామం వడ్డేగేరిలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి ఆంజనేయులు కుమారుడు అశోక్ (14) మహబూబ్‌నగర్ బీకేరెడ్డి కాలనీలోని బీసీ గురుకులలో 8వ తరగతి చదువుతున్నాడు. 15 రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. ఇంట్లోకి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి వెంటనే విద్యార్థిని నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించగా మృతిచెందారని వైద్యులు ధ్రువీకరించారు. సంఘటనపై ఎస్‌ఐ శ్రీనివాస్‌రావును వివరణ కోరగా చనిపోయిన విషయం వాస్తమేనని, తమకు ఫిర్యాదు అందలేదని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

యువ రైతు దుర్మరణం

అమ్రాబాద్: రోడ్డు ప్రమాదంలో యువ రైతు దుర్మరణం చెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. లక్ష్మాపూర్(బీకే)తండాకు చెందిన రమావత్‌రవి(35)తన సొంత పొలంలో మిర్చి పంట సాగు చేశాడు. ప్రస్తుతం మిర్చి తెంపుతున్నారు. పొలం నుంచి రాత్రి 8గంటల సమయంలో తన బైక్‌పై ఇంటికి వస్తుండగా లక్ష్మాపూర్(బీకే) గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వీరబాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

వ్యక్తి మృతి

అచ్చంపేట రూరల్: వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. బల్మూర్ మండలం తుమ్మెన్‌పేటకు చెందిన సత్యనారాయణచారి(48) బయటకు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పాడు. పట్టణంలోని అంగిరేకుల శేఖరయ్య ఫంక్షన్‌హాలు సమీపంలో మృతి చెంది ఉండటంతో స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మూర్ఛ రావడంతో మృతి చెంది ఉంటాడని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

మృతదేహం లభ్యం

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మరాశిపల్లి వార్డులోని కేఎల్‌ఐ ప్రధాన కాల్వలో గురువారం మృతదేహం లభ్యమైంది. పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న తిమ్మరాశిపల్లి వార్డు ప్రజలకు గ్రామం గుండా ప్రవహించే కేఎల్‌ఐ కాల్వలో అదే గ్రామానికి అల్లుడైన హైమద్ ఖాన్ (45) మృతదేహం కనిపించింది. గ్రామస్తులు వెంటనే కుటుంబసభ్యులతో పాటుగా, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్థానికుల బయటకు తీశారు. మృతుడు పట్టణంలోని సోఫీకాలనీలో ఉంటూ ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా పంక్చర్ దుకాణాన్ని నడుపుతున్నాడు. ఇదే విషయమై ఎస్‌ఐ రమేష్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని, మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

నలుగురిపై కేసు

గండేడ్: మహిళపై దాడికి పాల్పడిన కేసులో నలుగురు మహిళలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే మండలంలోని కప్లాపూర్ శివారులో నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపాలిటీ పరిధిలోని సంపల్లికి చెందిన బెస్త అంజమ్మ పది ఎకరాల పొలం కొన్నది. అందులో 8ఎకరాలు పంట సాగు చేయగా మరో 2ఎకరాలు బీడు ఉంచింది. దాంట్లో ఉన్న చెట్లు అదే జిల్లా బోగారం చెందిన చెన్నమ్మ, రాములమ్మ, సత్యమ్మ, పడమటి అనంతమ్మ గత నెల 27న నరికి తీసుకెళ్తుండగా అంజమ్మ అడ్డుకుంది. దాంతో వారు ఆమెను దూషించడంతో పాటు దాడి చేశారు. అంజమ్మ మహమ్మదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం ఎస్‌ఐ సైదయ్య తెలిపారు.

కత్తితో బెదిరించి పుస్తెల తాడు చోరీ

అచ్చంపేట రూరల్: కత్తితో బెదిరించి ఓ మహిళ మెడలోని 5 తులాల బంగారు పుస్తెల తాడును చోరీ చేసిన సంఘటన గురువారం సాయంత్రం అచ్చంపేటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అచ్చంపేటకు చెందిన ఫర్టిలైజర్ దుకాణదారుడు కొరివి మనోహర్ కుమార్తె స్వప్న పుట్టింటికి వచ్చి ఇంటి దగ్గర ఉండగా గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి ఇంటి వెనకాల నుంచి లోపలికి ప్రవేశించి కత్తితో బెదిరించి మెడలోని బంగారు పుస్తెల తాడు ఇవ్వాలన్నాడు. ప్రతిఘటించిన ఆమె చేతిని కత్తితో గాయపరిచి.. మెడలోని పుస్తెల తాడును లాక్కొని పరారయ్యాడు. విషయం కుటుంబ సభ్యులకు చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ ఘటనపై మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డివిజన్ కేంద్రంలో డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు ఉన్న ప్రాంతంలోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

అయోమయంలో నిర్వాసితులు


ఎర్రగట్టు వద్ద నివాసం ఉంటున్న బొల్లారం నిర్వాసితులు

- అటవీశాఖ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని శ్రీశైలం నిర్వాసితుల ఆందోళన
- ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వని వైనం

కొల్లాపూర్ రూరల్: శ్రీశైలం ప్రాజెక్టు 1979లో నిర్మించడంతో నల్లమల అడవి సమీపంలో కృష్ణానది ఒడ్డున ఉన్న మొగులత్ బొల్లారం గ్రామం బ్యాక్ వాటర్‌లో మునిగిపోయింది. అప్పట్లో గ్రామంలో 150 కుటుంబాలు ఉండేవి. ఆనాటి పాలకులు ప్రస్తుతం ఉన్న కొల్లాపూర్ మండలం, బోడబండ తండా పంచాయతీ పరిధిలోని ఎర్రగట్టు సమీపంలో సర్వే నంబర్ 399లో 7 ఎకరాల రెవెన్యూ భూమిలో నివాస గుడిసెలు ఏర్పాటు చేసి, 1980లో పట్టాలు ఇచ్చారు. కొన్ని కుటుంబాల వారు గ్రామం మునిగిపోవడంతో వారి బంధువుల వద్దకు వెళ్లారు. మిగిలిపోయిన 60 కుటుంబాల వారికి ఎర్రగట్టు వద్ద అధికారులు నివాసాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎర్రగట్టు బొల్లారం అంటున్నారు. నేటి వరకు అక్కడే ఉంటూ సమీపంలో ఉన్న అటవి భూమిని శిస్తు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల అధికారులు నివాస గృహాలు ఉన్న భూమి అటవిశాఖ పరిధిలో ఉన్నదని శాశ్వత గృహాలు నిర్మించుకోవడానికి అనుమతి లేదని చెబుతున్నారు. ఎన్నో సార్లు ఎమ్మెల్యే, కలెక్టర్, ఫారెస్ట్ ఉన్నత అధికారులకు వినతులు ఇచ్చిన ఫలితం లేకుండాపోయిందని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిస్తు చేసుకుంటున్న దాదాపు 200ఎకరాల భూమికి కూడా ఫారెస్టు అధికారులు పట్టాలివ్వలేదని వారు రోదిస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి నివాస గృహల నిర్మాణాలకు, భూములకు పట్టాలివ్వాలని కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి రెండు సార్లు గ్రామాన్ని సందర్శించి అన్ని విధాల ఆదుకుంటానని చెప్పి, పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

పట్టాలివ్వాలి



శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో అంతా కోల్పోయిన తమను ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు. ఇప్పటికైనా నా స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని నివాసం ఉంటున్న చోటే పట్టాలిచ్చి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతున్నాం.
– సుధాకర్, ఎర్రగట్టు బొల్లారం

న్యాయం చేయాలి



1980 నుంచి ఎర్రగట్టు వద్దనే నివాసం ఉంటున్నాం. ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు. అయినా జీవనోపాధి లేక ఇక్కడే బ్రతుకుతున్నాం. పాలకులు, అధికారులు స్పందించి నివాసగృహాలు, శిస్తు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలి.
– మహేష్, ఎర్రగట్టు బొల్లారం

రైతుల కోసం ‘వేసైడ్ మార్కెట్’


వనపర్తిలో పండించిన వంకాయలను మంత్రి నిరంజన్‌రెడ్డితో కలిసి పరిశీలిస్తున్న ఎరిక్ ఫైర్వాల్డ్

- పనులను పరిశీలించిన మంత్రి నిరంజన్‌రెడ్డి, సింజెంటా సంస్థ సీఈఓ ఎరిక్ ఫైర్వాల్డ్

వనపర్తి: సామాజిక బాధ్యతగా రైతుల కోసం జిల్లాలో రూ.3.40 కోట్లతో వేసైడ్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నామని సింజెంటా సంస్థ సీఈఓ ఎరిక్ ఫైర్వాల్డ్ అన్నారు. గురువారం ఆయన మార్కెట్ షాపింగ్ పనులను మంత్రి నిరంజన్‌రెడ్డితో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి అభ్యర్థన మేరకు, రైతుల ప్రయోజనం కోసం అత్యధిక నిధులను వెచ్చించి గ్రామీణ ప్రాంతంలో రైతులు పండించిన ఆకుకూరగాయలను ప్రజలకు నేరుగా చౌకధరలకు విక్రయించేందుకు ఈ కాంప్లెక్స్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు. రైతుల కోసం కల్పించిన అన్ని రకాల సౌకర్యాలను ఎక్కువకాలం ఉపయోగించుకునేలా చూడాలని కోరారు. వ్యవసాయరంగంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాన్ని సందర్శించటం, మంత్రి సొంత నియోజకవర్గంలో పేదరైతుల కోసం మార్కెట్‌ను నిర్మాణం చేయించటం మా బాధ్యతగా భావిస్తున్నట్లు వెల్లడించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ విధానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని, భవిష్యత్ ప్రపంచానికి భారత్ అన్నం పెట్టనుందని మంత్రి అన్నారు. ప్రపంచంలో సింజెంటా సంస్థ నాణ్యమైన కూరగాయలను రైతులకు అందిస్తూ, కొన్ని దశాబ్దాలుగా అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సునీల్ కుమార్, కేసీ రవి, అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ శ్రీధర్, కౌన్సిలర్ బాషానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాటన్‌మిల్లులో అగ్ని ప్రమాదం


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రాంచందర్

- రూ.40 లక్షల ఆస్తినష్టం

ఊట్కూర్: మండల కేంద్రం శివారులోని విజయ కాటన్ మిల్లులో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పత్తి గింజలు వేరు చేసే మిషన్ల వద్ద విద్యుదాఘాతం రావడంతో పెద్ద ఎత్తున మంటలు అంటుకున్నాయి. మంటలు, పొగ అధికం కావడంతో పనిచేస్తున్న సిబ్బంది బయటకు పరుగులు తీశారు. మిల్లులో ఏర్పాటు చేసిన నీటి పంపుల ద్వారా సిబ్బంది మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు అధికం కావడంతో నారాయణపేట అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించగా అధికారి వెంకటయ్యగౌడ్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని రెండు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపు చేశారు. మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో నారాయణపేటకు–మక్తల్ రహదారిపై ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. రోడ్డుపై గంట పాటు పొగ వ్యాపించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఆర్డీఓ రాంచందర్, డీఎస్పీ సత్యనారాయణ, తహసీల్దార్ తిరుపతయ్య, సీఐ సీతయ్య సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మిల్లు యజమాని మితీశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు. ప్రమాదంలో రూ.40 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు యజమాని పేర్కొన్నారు.

పొలాల్లో భూసారాన్ని పెంచుకోవాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రైతులు తమ వ్యవసాయ పొలాల్లో క్రిమిసంహారక మందులకు బదులు భూసారాన్ని పెంచే సేంద్రియ ఎరువులు వాడాలని పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థినులు అన్నారు. గురువారం మండలంలోని బొందలపల్లిలో గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ క్షేత్రాల్లో భూసారాన్ని పెంచుకునే అంశంపై అవగాహన కల్పించారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని మొక్కలకు పోషకాలందించే సేంద్రియ ఎరువులను వాడుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎకరా పొలంలో మూడు నాలుగు చోట్ల నుంచి మట్టిని సేకరించాలన్నారు. దీనిపై నేలపై ఉన్న చెత్తాచెదారాన్ని తీసేసి ‘వి’ ఆకారంలో గుంత తీసి ఒకవైపు నుంచి పార సహాయంతో కొంత మట్టిని తీసుకుని పాలిథిన్ కవర్‌పై పరిచి 4 సమభాగాలుగా విభజించి ఒక భాగాన్ని తీసివేసి రెండు భాగాలను కలిపి భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రావేఫ్ విద్యార్థినులు ప్రియాంక, ఉపశ్రీ, శ్రీలేఖ, ప్రవళిక, ఇంద్రాణి, విజయ, రైతులు విష్ణువర్ధన్‌రెడ్డి, చిన్నపర్వత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థినులు

చదువుకు దూరమవుతున్న విద్యార్థులు


శేరుపల్లెలో ప్రైవేట్ స్కూల్ బస్సులో విద్యార్థులతో సెల్ఫీ తీసుకుంటున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

- నియోజకవర్గంలో రవాణా సౌకర్యం కల్పించని ప్రజాప్రతినిధులు
- ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ఉండవెల్లి: నియోజకవర్గంలో పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని, విద్యార్థులు, ప్రజలకు కనీసం రవాణా సౌకర్యం కల్పించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. గురువారం మండలంలోని శేరుపల్లె, ప్రాగటూరు, మారమునగాల–1, 2 గ్రామాల్లో బహుజన రాజ్యాధికార యాత్రలో పాల్గొని ప్రజలు, విద్యార్థులతో ముచ్చటించారు. శేరుపల్లెలో ప్రభుత్వ పాఠశాల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. గ్రామీణ విద్యార్థులు ఉన్నత పాఠశాలకు తక్కశీల, ఉండవెల్లి, అలంపూర్ చౌరస్తాకు వెళ్లాలంటే రవాణా సౌకర్యం లేక చదువు మానేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతులకు స్థానికంగా మార్కెట్ లేక పక్క రాష్ట్రానికి వెళ్తున్నారన్నారు. గ్రామాల్లో ప్రమాదాలు, విషపురుగులు, అత్యవసర పరిస్థితులలో ఆస్పత్రికి వెళ్లాలంటే కర్నూల్‌కు వెళ్లాల్సి వస్తుందని అన్నారు. వంట గ్యాస్ ధరలు ఆకాశాన్ని తాకుతుంటే, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అదానీకి బ్యాంకులు కట్టబెడుతుందని విమర్శించారు. మారమునగాల–1, 2 గ్రామాల్లో పర్యటిస్తూ మాట్లాడారు.. బహుజన రాజ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వారికి మేమున్నామని, మమ్మల్ని ఆదరించాలన్నారు. పేద కుటుంబం నుంచి వచ్చిన వారిమే పేదల గురించి ఆలోచిస్తామన్నారు. విద్యార్థుల జీవితాలు బాగుపడాలన్న, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్న, ఉద్యోగాలు రావాలన్న బీఎస్పీకి మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కేశవరావు, మహేష్, ప్రభుదాసు, రాములమ్మ, అయ్యన్న, ఖాజ, శివ తదితరులు పాల్గొన్నారు.

వర్క్ ఫ్రం హోం ఉద్యోగం పేరిట మోసం

మహబూబ్‌నగర్ క్రైం: వర్క్ ఫ్రం హోం పేరుతో ఉద్యోగం ఇస్తామని చెప్పి..మొదట కొంత డబ్బులు కట్టాలని చెప్పి ఆ తర్వాత ఆన్‌లైన్‌లో డబ్బులు వసూలు చేసిన ఘటన మహబూబ్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్‌లోని ప్రేమ్‌నగర్‌కు చెందిన శివరాం రాథోడ్‌కు జనవరి 28న అతని ఫోన్‌కు వర్క్‌టూ హోం లింక్ అనే మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌ను క్లిక్ చేయగా వెంటనే వాట్సాప్ ఒపెన్ అయిన క్షణాల్లో వాట్సాప్ ద్వారా శివరాం రాథోడ్‌కు ఫోన్ వచ్చింది. ఫోన్ ద్వారా అతనికి వర్క్ టు హోం చేయాలంటే ముందు కొంత డబ్బులు చెల్లించాలని చెప్పడంతో శివరాం రాథోడ్ తన ఫోన్ నుంచి 8787364008 నంబర్‌కు మొదట రూ.10 వేలు, ఆ తర్వాత రూ.14,500, మూడోసారి రూ.14,560 ఇలా విడతల వారీగా మొత్తం రూ.63వేలు పంపించాడు. ఇంకా రూ.10వేల పంపించాలని సైబర్ నేరగాళ్లు అడగడంతో శివరాం రాథోడ్‌కు అనుమానం వచ్చి 1930 సైబర్ క్రైంలో ఫిర్యాదు చేయగా ఇతను పంపిన డబ్బులో జనవరి 30న రూ.18,892 నగదు ఫ్రీజ్ చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఓటీపీ చెప్పి మోసపోయిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు

అచ్చంపేట రూరల్: తనకు వచ్చిన ఓటీపీ నంబర్ చెప్పడంతో ఓ విశ్రాంత ఉపాధ్యాయుడి బ్యాంకు ఖాతాలోని డబ్బులు మాయమయ్యాయి. వివరాలిలా .. పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డికి ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. మీ పాన్ కార్డుకు బ్యాంకు ఖాతా నంబర్ అనుసంధానం చేయాలి, ఇప్పటికే చాలా ఆలస్యమైంది వెంటనే లింక్ చేసుకోండని తెలిపాడు. అతన్ని నమ్మి అడిగిన వివరాలు తెలిపాడు. ఫోన్‌కు వచ్చిన ఓటీపీని సైతం చెప్పాడు. వెంటనే తన ఖాతాలోని రూ. 25వేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. మోసపోయానని గ్రహించి వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రెండోరోజు ‘సర్కార్ నౌకరి’ చిత్రీకరణ


సన్నివేశం చిత్రీకరణలో తనికెళ్లభరణి

కోడేరు: మండలంలోని ఎత్తంలో ‘సర్కార్ నౌకరి’ సినిమా చిత్రీకరణ కోదండరామస్వామికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయంలో కోట బురుజు, ఇళ్ల వద్ద నటుడు తనికెళ్లభరణి చిత్రీకరణ చేశారు. గ్రామంలోని ఆలయం ఎదుట రచ్చబండ వద్ద సినీ నిర్మాత రాఘవేందర్‌రావు, గాయిని సునీత సందడి చేశారు. మొదటి సారి గ్రామంలో చిత్రీకరణ చేస్తుండడంతో ప్రజలు చూసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కొందరు యువకులు రాఘవేందర్‌రావు, తనికెళ్లభరణితో సెల్ఫీలు దిగారు.

36గంటల పాటు అంగన్‌వాడీల సమ్మె

నారాయణపేట టౌన్: హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద 36 గంటల పాటు సమ్మెలో భాగంగా గురువారం రాత్రి వంటావార్పుతో నిరసన తెలిపారు. మున్సిపల్ పార్కు వద్దే భోజనాలు చేసి, రాత్రి బస చేశారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం సాగుతుందన్నారు. గ్రాట్యూటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వాలు కదలకపోడం దారుణమని సీఐటీయూ నాయకులు విమర్శించారు. కార్యక్రమంలో శశికళ, మంజుల హెల్పర్స్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ముగ్గురికి గాయాలు

మక్తల్: లారీ ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన మండలంలోని జక్లేర్‌లో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఊట్కూర్ మండలం ఎడవెల్లికి చెందిన ఎర్రప్ప, మన్యం, చందన మక్తల్ నుంచి నర్వకు బైకుపై బయలుదేరారు. మహబూబ్‌నగర్ నుంచి రాయచూర్‌కు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. దీంతో ముగ్గురికి గాయాలు కాగా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తల్లీకూతురి మృతి అనుమానాస్పదమే?


తల్లి సుశీత (ఫైల్)


కూతురు అఖిల (ఫైల్)

వనపర్తి క్రైం: అభం, శుభం తెలియని చిన్నారి, తల్లి మృతదేహాలు బావిలో చూసిన ప్రతి మనసు చలించిపోయింది. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకోగా, వారి వివరాలు లభించలేదు. గురువారం వీరి వివరాలను పోలీసులు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం గుమ్మకొండ చెందిన సుశీత(35), భర్త నర్సింహ, కూతురు అఖిల(4) ఉన్నారు. అయితే అనారోగ్యానికి గురైన భర్త మూడేళ్ల క్రితం చనిపోయాడు. పదేళ్ల నుంచి ఆమె వనపర్తి మండలం పెద్దగూడెంలోని బూరాన్ స్వామి వద్దకు వస్తుంటారు. గత నెల 24వ తేదీన పెద్దగూడెంకు ఆమె, కూతురితో కలిసి గుట్టపై ఉన్న స్వామిని దర్శించుకున్నారు. వారిచ్చే నిమ్మకాయలు, సాంబ్రాణి ఇతర వాటిని స్వీకరించారు. మరుసటి రోజు వరకు కూతురిని ఉపవాసం ఉంచింది. కాగా ఏమి జరిగిందో తెలియదు కానీ వారు 28వ తేదీ మంగళవారం బావిలో మృతదేహాలు తేలాయి.

అంతుచిక్కడం లేదు..

వనపర్తి మండలం పెద్దగూడెం శివారులోని వ్యవసాయ బావిలో లభ్యమైన తల్లీకూతురి మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా హత్య చేశారా? ఆత్మహత్యకు పాల్పడ్డారా అనే విషయం పోలీసులకు అంతుచిక్కడం లేదు. గ్రామంలో ఉన్న స్వామి దగ్గరికి వచ్చిన వారు ఊరి బయట ఉన్న వ్యవసాయ బావిలో ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డారన్న విషయం అనుమానాస్పదంగా ఉంది.

హన్వాడలో బంగారం చోరీ

- పోలీస్‌స్టేషన్‌లో తారుమారైన కేసు
- ఎత్తుకెళ్లిన బంగారంపై స్పష్టత లేని వైనం

హన్వాడ: మండల కేంద్రంలో బంగారం చోరీ అయిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన నగల వ్యాపారి చింతకింది మధువెంకటేశ్వర్‌రావు రాష్ట్రంలోని పలు పట్టణాల్లో బంగారు నగలు తయారు చేసి విక్రయిస్తుంటాడు. గత నెల 28న షాద్‌నగర్, మహబూబ్‌నగర్, కుల్కచర్ల, హన్వాడ, ఇతర ప్రాంతాల్లోని దుకాణ యజమానులకు బంగారు నగలను అందించాడు. ఈయన బుధవారం రాత్రి మండలానికి చేరుకున్నాడు. స్థానికంగా షాపు నిర్వహించే రాజస్థాని దినేష్ ఇంట్లో బస చేశాడు. దినేష్ బంధువులైన వికాస్, వినోద్ కూడా అదే ఇంట్లో నిద్రించారు. తెల్లారిసరికి తన బస్తాలో నగలు కనిపించడం లేదని చింతకింద మధువెంకటేశ్వరావు దినేష్, అతని సంబంధీకులైన వారితో వాపోయాడు. వారిలో వినోద్ కనిపించడం లేదని గుర్తించి, అతను నిర్వహించే జ్యువెలరీ షాపు కోస్గి మండలంలోని గుండుమాల్‌కు వెళ్లి పరిశీలించారు. అక్కడ కూడా బంగారం దొరక్కపోవడంతో చేసేది లేక వ్యాపారి హన్వాడ పోలీసులను ఆశ్రయించాడు.

40 లేకా 31తులాలా?

బంగారం పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో అపహరణకు గురైన బంగారాన్ని వినోద్ నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. తస్కరించిన బంగారం 400 గ్రాములు (40తులాలు) ఉన్నట్లు పుకార్లు వచ్చాయి. పోలీసులు మాత్రం 31తులాలుగా నిర్ధారించారు. చోరీ చేసిన వినోద్ పట్టుబడలేదని తెలుపుతూనే 31తులాలుగా పోలీసులు చెప్పడం గమనార్హం. మరోవైపు బాధితుడు నగలకు సంబంధించిన మొత్తం రశీదులు చూపించి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలపడం కొస మెరుపు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవినాయక్ తెలిపారు.

క్లుప్తంగా...

నేటి నుంచి తిరుమలలో తెప్పోత్సవాలు

5 రోజుల పాటు పలు ఆర్జిత సేవల రద్దు

తిరుమల: తిరుమలలోని శ్రీవారి పుష్కరిణిలో శుక్రవారం నుంచి 5 రోజులు పాటు తెప్పోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా విద్యుద్దీపాలతో తిరుమల ఆలయం, పరిసరాలను శోభాయమానంగా అలంకరించారు. శ్రీవారి తెప్పోత్సవాల్లో పాల్గొనాలనుకునే భక్తుల కోసం టీటీడీ కరెంట్ బుకింగ్ ద్వారా ప్రతిరోజు 200 టికెట్లను జారీ చేయనుంది. ఈ టికెట్లు ఉన్న భక్తులను టీటీడీ పుష్కరిణిలోకి ప్రత్యేకంగా అనుమతించనుంది. తెప్పోత్సవాల నేపథ్యంలో 5 రోజుల పాటు పలు ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టైం స్లాట్ దర్శన టికెట్లు కలిగిన వారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 16 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

హ్యాండ్లూమ్ ఎక్స్‌పో 11 నుంచి

సాక్షి, హైదరాబాద్: నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఈనెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నేషనల్ హ్యాండ్లూమ్ ఎక్స్‌పో–2023ని నిర్వహించనున్నారు. రాష్ట్ర చేనేత ఉత్పత్తుల సంస్థ, జాతీయ హ్యాండ్లూమ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. భారతదేశం నలుమూలల నుంచి చేనేత ఏజెన్సీల భాగస్వామ్యం ఉంటుందని పేర్కొన్నారు. ఎక్స్‌పోలో 20 నుంచి 30 శాతం తగ్గింపు ధరలకు ఉత్పత్తులను విక్రయిస్తారని నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్ పీఆర్సీపై 6న చర్చలు

జేఏసీల నేతలను ఆహ్వానించిన యాజమాన్యాలు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణపై సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు విద్యుత్ సౌధలో చర్చలకు రావాలని విద్యుత్ ఉద్యోగ సంఘాల జేఏసీలను విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఆహ్వానించాయి. సమావేశంలో తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు, ఉత్తర, దక్షిణ డిస్కంల సీఎండీలు రఘుమారెడ్డి, గోపాల్‌రావు ఉద్యోగ నేతలతో చర్చించనున్నారు. అనంతరం పీఆర్సీ ఫిట్‌మెంట్ శాతాన్ని సిఫారసు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు యాజమాన్యాలు నివేదిక అందజేయనున్నాయి. త్వరలో సీఎం కేసీఆర్ పీఆర్సీపై ప్రకటన చేసే అవకాశం ఉంది.

ఈసారి ఇయర్ ఎండింగ్ పేరుతో!

- అకౌంట్ టేకోవర్ బారిన మరో సంస్థ
- 8430 డాలర్లు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ స్థాయిలో లావాదేవీలు చేసే కంపెనీలను టార్గెట్‌గా చేసుకుంటున్న సైబర్ నేరగాళ్లు అకౌంట్ టేకోవర్ ఫ్రాడ్స్ కొనసాగిస్తున్నారు. సిటీ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్ పరిధిలో వారం రోజుల్లో రెండో కేసు నమోదైంది. బంజారాహిల్స్ కేంద్రంగా పని హెచ్‌బీఎల్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్ సంస్థ నుంచి రూ.1.39 లక్షల డాలర్లు కాజేయగా గత శుక్రవారం... బాగ్ అంబర్‌పేట్ ఏబీఆర్ ఆర్గానిక్స్ లిమిటెడ్ సంస్థ నుంచి 8430 డాలర్లు స్వాహా చేయడంపై గురువారం హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఈసారి సైబర్ నేరగాళ్లు ఫైనాన్షియల్ ఇయర్ ఎండింగ్ కారణంగా చూపి తమ బ్యాంకు ఖాతా వివరాలు ఈ–మెయిల్ చేశారు. ఏబీఆర్ సంస్థ వివిధ రకాలైన రేసిన్ సంబంధిత రసాయనాలకు తయారు చేస్తుంది. దీనికోసం కొన్నాళ్లుకు చైనాకు చెందిన సంస్థ నుంచి ముడి పదార్థాలు దిగుమతి చేసుకుంటోంది. దీనికి సంబంధించిన ఇన్వాయిస్‌లు ఈ–మెయిల్ ద్వారా అందుకున్న వెంటనే ఏబీఆర్ సంస్థ నగదును చెల్లిస్తుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో ఉన్న తమ ఖాతా నుంచి చైనాలోని సదరు సంస్థ ఖాతాలోకి ఈ మొత్తం బదిలీ చేస్తుంటుంది. ఈ లావాదేవీలకు సంబంధించి ఈ రెండు సంస్థల మధ్యా ఈ–మెయిల్స్ ద్వారా సంప్రదింపులు జరుగుతాయి. చైనా సంస్థకు చెందిన ఈ–మెయిల్‌ను హ్యాక్ చేయడం ద్వారా సైబర్ నేరగాళ్లు ఈ సంప్రదింపులను గుర్తించారు. నగదు చెల్లింపు సమయం ఆసన్నమైందని తెలుసుకున్న కేటుగాళ్లు చైనా సంస్థ మాదిరిగా ఏబీఆర్‌కు ఈ–మెయిల్ పంపారు. ఆ సంస్థ పేరుతోనే దీన్ని రూపొందించిన సైబర్ క్రిమినల్స్ చివరలో మాత్రం మెయిల్.కామ్‌ను చేర్చారు. అందులో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో తమ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఆడిటింగ్ జరుగుతోందని, ఈ నేపథ్యంలోనే గతంలో నగదు పంపే ఖాతాలకు కాకుండా కొత్త దానికి పంపాలంటూ సూచించారు. సైబర్ నేరగాళ్లు దుబాయ్‌లో ఉన్న తమ బ్యాంకు ఖాతా వివరాలు ఈ ఈ–మెయిల్‌లో పొందుపరిచారు. ఈ–మెయిల్ ఐడీలో మార్పులు గమనించని ఏబీఆర్ సంస్థ ఇటీవల వచ్చిన ముడి సరుకునకు సంబంధించిన 8430 డాలర్లు (దాదాపు రూ.7 లక్షలు) దుబాయ్‌లోని బ్యాంక్ ఖాతాలోకి బదిలీ చేశారు. గడిచిన కొన్నాళ్లుగా చైనా సంస్థ నుంచి ఏబీఆర్ సంస్థకు వరుస ఈ–మెయిల్స్ వస్తున్నాయి. అందులో తమకు చెల్లించాల్సి మొత్తం తక్షణం బదిలీ చేయాలంటూ చైనా సంస్థ కోరింది. దీంతో ఏబీఆర్ సంస్థ ప్రతినిధులు ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. సంస్థ ఎండీ ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆలయ భూముల కబ్జాపై నోటీసులు

వివరాలు తెలియజేయాలని అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆలయ భూముల కబ్జాపై వివరాలు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 13కు వాయిదా వేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని పలు ఆలయాల భూములను కబ్జా చేసి ఏకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారంటూ ఓ పత్రికలో ప్రచురితమైన వార్త ఆధారంగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన సి.అనిల్‌కుమార్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'జడ్చర్లలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన దాదాపు 63 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. దేవరకద్ర మండలం అప్పంపల్లిలో చినరాజమూరి ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన భూమిలో ప్లాట్లు, లే–అవుట్లు వెలిశాయి. నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని 44 ఎకరాల ఆలయ భూమిలో సగానికి పైగా కబ్జాకు గురైంది. పూర్వం రాజులు, నిజాం నవాబులు పాలమూరులోని పలు ఆలయాలకు పెద్ద ఎత్తున భూములు ఇచ్చారు. ఈ భూముల సాగు ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆలయ నిర్వహణకు వెచ్చించాలన్నది వారి సంకల్పం. అయితే ఇటీవల కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారులు మిలాఖత్ అయి అందినకాడికి దండుకుని భూములను పంచి పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో వందల ఎకరాల ఇనాం భూమి అన్యాక్రాంతమైంది. ఆలయ భూములను కాపాడటమే కాకుండా, ఇకపై కబ్జాకు గురికాకుండా న్యాయపరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రధా న న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్‌భూయాన్, జస్టిస్ తుకారాం జీ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. అధికా రులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను వాయిదా వేసింది.

దోపిడీ పాలకులను గద్దె దింపాలి



ప్రాగటూరులో వలస కూలీలతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

ఉండవెల్లి: తెలంగాణలో దోపిడీ పాలకులను గద్దె దింపి.. బీఎస్పీని అధికారంలోకి తీసుకొస్తే 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. ఆయన చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర గురువారం రాత్రి జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం శేరుపల్లె, ప్రాగటూరు, మారమునగాల–1, 2 గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అంతకు ముందు మిర్చి తీయడానికి కేటీదొడ్డి నుంచి ప్రాగటూరుకు వచ్చిన వలస కూలీలతో ఆయన మాట్లాడారు. పూరి గుడిసెల్లో ఉంటూ పిల్లలను ఎందుకు ఆగం చేస్తున్నారని వారిని ప్రశ్నించారు, గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాల్లో పిల్లల్ని చేర్చాలని సూచించారు. అనంతరం ప్రాగటూరులో పార్టీ జెండాను ఆవిష్కరించారు.

రియల్ స్టార్‌కి రీల్ సార్ యూనిట్ సాయం

రంగయ్య మాస్టారుకి రూ.3లక్షలు అందించిన డైరెక్టర్ వెంకీ అట్లూరి



సాక్షి, హైదరాబాద్: తమిళనటుడు ధనుష్, సంయుక్తా మీనన్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం 'సార్' (తమిళంలో 'వాత్తి'). గత నెల ఫిబ్రవరి 17న విడుదలైన 'సార్' చిత్రంలో కథరీత్యా సిరిపురం అనే ఊరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు జూనియర్ లెక్చరర్‌గా వెళతాడు బాలగంగాధర తిలక్ (సినిమాలో ధనుష్ పాత్ర..) కానీ అక్కడి విద్యార్థులెవరూ కళాశాలకు రాకపోవడంతో వారిని తిరిగి కళాశాలకు వచ్చేలా చేస్తాడు. విద్య గొప్పతనాన్ని తెలియజేస్తూ, కుల వ్యవస్థపై వారిని చైతన్యవంతులను చేసేందుకు కృషి చేస్తాడు తిలక్. ఇదంతా రీల్‌లో.. కానీ రియల్‌గానూ బాలగంగాధర తిలక్ పాత్రను పోలిన వ్యక్తి ఉన్నారు. ఆయనే కేడర్ల రంగయ్య.

అచ్చు సినిమాలో మాదిరిగానే..

కొమురం భీం జిల్లా కెరమెరి మండలం సావర్ ఖేడలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు కేడర్ల రంగయ్య. ఆయన ప్రధానోపాధ్యాయుడిగా ఉన్నప్పుడు ఆ పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య 60. కానీ కృషి చేసి విద్యార్థుల సంఖ్యను ఆయన 260కి పెంచారు. తన కుమార్తెను అదే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడమే కాకుండా, సొంత డబ్బుతో పాఠశాలకు మరమ్మత్తులు చేపట్టి ఆ గ్రామస్తుల్లో స్ఫూర్తి నింపారు. ఆయనకు ఉత్తమ ఉపాధ్యాయుడిగా జాతీయ అవార్డు కూడా వచ్చింది. కాగా 'సార్' చిత్రానికి కేడర్ల రంగయ్య జీవితం స్ఫూర్తి కాకపోయినప్పటికీ, ఆయన జీవితం 'సార్'లోని ధనుష్ పాత్ర తిలక్‌కు దగ్గరగా ఉండటంతో ఆయన్ను కలిశారు చిత్రదర్శకుడు వెంకీ అట్లూరి. ''సార్' సినిమా చూస్తున్నప్పుడు కొన్ని సన్నివేశాల్లో నన్నే నేను చూసుకున్నట్లు ఉంది'' అని కేడర్ల రంగయ్య చెప్పడంతో వెంకీ ఎంతో సంతోషించారు. కాగా రంగయ్య చేస్తున్న మంచి పనుల్లో భాగస్వామ్యం కావాలని 'సార్' చిత్రం యూనిట్ రూ.మూడు లక్షలను ఆయనకు ఆర్థిక తోడ్పాటుగా అందించారు. విద్యార్థులు, పాఠశాలల్లోని మెరుగైన సదుపాయాలు, లైబ్రరీ నిర్మాణం వంటి వాటికి ఈ నగదును వినియోగించనున్నారు.

వేసవిలో నీటి కటకట రావొద్దు

మంత్రి ఎర్రబెల్లి ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: వేసవిలో తాగునీటి సరఫరాలో ఎక్కడా ఇబ్బంది లేకుండా చూడాలని, రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశించారు. కరెంటు సమస్యలు వచ్చినా నీటి సరఫరా ఆగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. పంపుల నిర్వహణ సరిగా నిర్వహించి పైప్ లైన్ లీకేజీలు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సారి ఎండలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, నీటి సరఫరాకు ఆటంకాలు లేకుండా, అన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గురువారం ఎండా కాలం సన్నద్ధత పై మిషన్ భగీరథ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో... వేసవిలో నిరాటంకంగా నిర్వర్తించాల్సిన మంచినీటి సరఫరాపై మంత్రి సూచనలు చేశారు. అధికారులు సర్వసన్నద్ధంగా ఉండి, సమన్వయంతో పని చేయాలన్నారు. ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, సీఈ, ఈఈలు, అన్ని జిల్లాల ఎస్‌ఈలు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అయ్యో.. వినయ్ సాయం చేసే వారే లేరా?



హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వినయ్

- సైన్స్‌ఫేర్‌లో కెమికల్ బాటిల్ తీసుకెళ్తూ గాయపడిన విద్యార్థి
- 25 శాతం కాలిన పొట్ట భాగం.. అనేక చోట్ల గాజుముక్కలు


సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సైన్స్‌ఫేర్‌లో చోటు చేసుకున్న అపశృతితో ఓ పేద విద్యార్థి తీవ్రంగా గాయపడగా.. సాయం కోసం దాతల చేయూతతో పాటు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. గత నెల 28న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మండలపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో అమ్మోనియం రసాయనం బాటిల్‌ను తీసుకెళ్తూ ఆరో తరగతి విద్యార్థి వినయ్‌కుమార్ అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో బాటిల్ పగిలిపోయి అందులోని రసాయనం వినయ్ శరీరంపై పడింది. ప్రాథమిక చికిత్స తర్వాత మెరుగైన వైద్యం కోసం విద్యార్థి తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రసాయనం శరీరంపై పడడంతో పొట్ట భాగం 25 శాతం మేర కాలిపోగా, గాజు ముక్కలు శరీరంలోని అనేక భాగాలు కుచ్చుకున్నాయని నిర్ధారించారు. చర్మం కాలిన చోట ప్లాస్టిక్ సర్జరీలు చేయాల్సి ఉంటుందని, ఇందుకు రూ.10 లక్షలు ఖర్చు కావొచ్చని వైద్యులు చెబుతున్నారు. కానీ వ్యవసాయకూలీలైన వినయ్ తల్లిదండ్రులు ఆ ఖర్చును భరించే స్థితిలో లేకపోవడంతో దాతలతో పాటు సర్కారు సాయం కోరుతున్నారు.

సూర్యప్రభ వాహనంపై స్వామివారి ఊరేగింపు



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీహరి మూలమంత్ర హోమం, సూర్యప్రభ వాహనంపై స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఊరేగించారు. భక్తులు గోవిందనామస్మరణ చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు విష్ణునారాయణ, గోవిందాచార్యులు, సురేషాచార్యులు, కన్నయ్యస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

మాలలకు అందని ద్రాక్షగా సంక్షేమ ఫలాలు



మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ఏర్పాటులో ముందు వరుసలో ఉండి మాలలు పోరాటం చేశారని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయ్య అన్నారు. గురువారం సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు మాలలకు అందని ద్రాక్షగా మారాయని అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దళితుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో మాదిగలే లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మాలలు 40 లక్షల జనాభా కలిగి ఉన్నారని తెలిపారు. అగ్రవర్ణ రాజకీయ పార్టీలు వారి స్వార్థ ప్రయోజనాల కోసం మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టి ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మాలలు ఏ రంగంలో మాదిగల కన్నా అభివృద్ధి చెందారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈనెల 5న మాల సంఘాలతో చర్చించి అన్యాయాల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మాల సంఘాల ప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని కోరారు. సమావేశంలో కర్ణ, రాఘవేందర్, వెంకటేష్, శ్యాంసుందర్, శ్రీనివాసులు, బాలరాజు, మాసయ్య, శివకుమార్, కథలయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

నిత్యకల్యాణం.. పచ్చతోరణం

- 5 నుంచి మన్యంకొండ అలివేలు మంగతాయారు ఉత్సవాలు
- 7న తిరుకల్యాణ మహోత్సవం
- అమ్మవారి సన్నిధిలో ఏటా వందలాది వివాహాలు



అలంకరణలో అలివేలుమంగతాయారు అమ్మవారి మూలవిగ్రహం



మన్యంకొండ అలివేలు మంగతాయారు దేవస్థానం (ఇన్‌సెట్‌లో..) వేంకటేశ్వరస్వామివారి సమేత అలివేలుమంగతాయారు అమ్మవారు

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని మన్యంకొండ అలివేలు మంగతాయారు దేవస్థానం నిత్య కల్యాణం.. పచ్చతోరణంగా బాసిల్లుతుంది. కొలిచిన వారికి కొంగు బంగారమై విరాజిల్లుతున్నది పుణ్యక్షేత్రం. ప్రతి సంవత్సరం అమ్మవారి సన్నిధిలో కొన్ని వందల వివాహాలు అవుతాయి. మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఉత్సవాలు ముగిసిన నెల రోజులకు దిగువ కొండ వద్ద కొలువుదీరిన అలివేలు మంగతాయారు ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది ఉత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నారు. రంగు రంగుల విద్యుత్ బల్బులతో దేవస్థానాన్ని సుందరంగా ముస్తాబు చేస్తారు. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన తిరుకల్యాణం మహోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆహ్లాదకర వాతావరణం..

దేవస్థానంలో వివిధ రకాల చెట్లతో పాటు శ్రీవారి వనంలో వివిధ రకాల మొక్కలను కూడా పెంచుతున్నారు. దీంతో దేవస్థానానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదకర వాతావరణం లభిస్తుంది. మల్లె, మందారం, బొడ్డుమల్లె ఇతర పూల మొక్కలతో పాటు మామిడి, ఉసిరి మొక్కలను పెంచుతున్నారు.

ఉత్సవాల విశేషోత్సవాలు..

ఉత్సవాల్లో భాగంగా 5న అంకురార్పణం, రాత్రి శేషవాహనసేవ నిర్వహించి శ్రీకారం చుడతారు. 6న ధ్వజారోహణం, దేవతాహ్వాణం, 7న మధ్యాహ్నం 12 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం, రాత్రికి గరుడవాహనసేవ, విమాన రథోత్సవం, 8న అశ్వవాహనసేవ, 9న పూర్ణాహుతి, వసంతోత్సవం, అవభృతస్నానం, రాత్రికి నాకబలి (నాగవెల్లి), ద్వాదశ రాధన, సప్తావరణాలు, మహాదాశీర్వచనం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు.

ఘనంగా ఆరుద్రోత్సవం

- అన్నాభిషేకంతో అలరారిన బాలబ్రహ్మేశ్వరుడు



అలంకరణలో బాలబ్రహ్మేశ్వరుడు



గోసహిత ప్రదక్షిణ

జోగుళాంబశక్తిపీఠం: అలంపూర్ బాలబ్రహ్మేశ్వస్వామి ఆలయంలో గురువారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఆరుద్రోత్సవాన్ని నిర్వహించారు. మొదటగా ధ్వజస్తంభ మండపం వద్ద గోమాతకు పూజలు చేశారు. అనంతరం గోసహితంగా వేద మంత్రాలు మంగళవాయిద్యాల మధ్య ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేపట్టారు. ఆలయ ప్రవేశం చేసి గణపతి పూజలు, పంచామృత అభిషేకాలు ప్రత్యేక అలంకరణలు చేశారు. వేద పండితులు ముక్తకంఠంతో మహన్యాస పారాయణాన్ని గావించారు. బాలబ్రహ్మేశ్వర స్వామి వారికి నమకచమకాలతో 11 పర్యాయాలు ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. అన్నసూక్తా పారాయణంతో అన్నాభిషేకాలు, శ్వేతాన్నంతో లింగాకృతి, సోమసూత్రం, వానవటం అలంకరించారు. బిల్వార్చాన, పుష్పార్చన, మహనైవేద్యాలు, దశవిధ హారతులు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



హారతులు అందుకుంటున్న భక్తులు



అన్నాభిషేకం చేస్తున్న అర్చకులు

సుదర్శన ఇష్టిలో వట్టెం వెంకన్న



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

బిజినేపల్లి: మండలంలోని వట్టెం వేంకటేశ్వర స్వామి వారి తృతీయ పుష్కర బ్రహ్మోత్సల సందర్భంగా గురువారం స్వామివార్లకు ఆలయ అర్చకులు సుదర్శన ఇష్టి కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తెల్లవారు జాము నుంచి ప్రాతరాధన, అర్చన సేవాకాలం, నివేదన, శాంతిపాఠం భక్తుల సమక్షంలో చేశారు. చతుస్థానార్చన, మూలమంత్ర హోమం పూజలు చేపట్టారు. రాత్రి స్థానిక గిరిజనుల సమక్షంలో ఆలయంలో నృత్యాలు, ఆట పాటల కార్యక్రమాలు నిర్వహించారు. పూర్ణాహుతి, హోమం, బలిప్రదానం చేపట్టారు. చినజీయర్‌స్వామి వారి రాక సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పాఠశాలలను పరిశీలించిన రాష్ట్రస్థాయి బృందం

పెబ్బేరు: ఉమ్మడి మండలంలోని శ్రీరంగాపూర్‌లో ప్రాథమిక పాఠశాల, పెబ్బేరు పట్టణంలో ఆదర్శ, కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మండలంలోని రంగాపూర్, తోమాలపల్లి పాఠశాలలను రాష్ట్రస్థాయి పరిశీలన బృందం గురువారం తనిఖీ చేశారు. పరిశీలకులు చంద్రశేఖర్, తరంగపాణిరెడ్డి, సతీష్‌కుమారు మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలను సాధించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం 31వ తేదీ వరకు చేపట్టాలన్నారు. వారి వెంట మండల నోడల్ అధికారులు వరలక్ష్మి, మద్దిలేటి, కాంప్లెక్స్ నోడల్ అధికారులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సభ్యులు

ఆర్డీఎస్‌లో కొనసాగుతున్న నీటి ప్రవాహం



ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో తనగాల సమీపంలో ప్రవహిస్తున్న నీరు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో నీటి ప్రవాహం గురువారం కొనసాగింది. దీంతో తుంగభద్ర నది సమీపంలో నిర్మించిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం మోటార్‌కు నీరందుతున్నాయి. రెండు రోజులుగా నీటి ప్రవాహం పూర్తిస్థాయిలో ఉండటంతో డిస్ట్రిబ్యూటరీలు, సబ్‌డిస్ట్రిబ్యూటరీ కాల్వల్లో నీటి ప్రవాహం కొనసాగుతుంది. రైతులు సాగుచేసిన మొక్కజొన్న, సీడు జొన్న, కూరగాయలు, మినుములు పంటలకు నీటి తడులు ఇస్తున్నారు.

ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద ఓవర్ ఫ్లో

టీబీ డ్యాం నుంచి వస్తున్న ఇండెంట్ నీటితో ఆర్డీఎస్ ఆనకట్ట వద్ద 1,090.4 లెవల్ ఉండగా 0.4 అడుగుల మేర ఓవర్‌ఫ్లో కొనసాగుతూ 2,357 క్యూసెక్కుల నీరు దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి చేరుతున్నట్లు ఏఈ శ్రీనివాసులు తెలిపారు. కర్ణాటక పరిధిలోని ఆర్డీఎస్ ప్రధాన కాల్వ 3.2 కిలోమీటర్ వద్ద 8.1 అడుగుల మేర ప్రవహిస్తూ 634 క్యూసెక్కులు దిగువకు వస్తున్నాయి. తెలంగాణ సరిహద్దు 42.60 కిలోమీటర్ వద్ద 4.10 అడుగుల మేర నీరు ప్రవహిస్తూ 352 క్యూసెక్కుల నీరు డీ–20 వరకు వచ్చి చేరుతున్నాయి. నీటి ప్రవాహం ఇలాగే కొనసాగిస్తూ మరో 20 రోజుల పాటు పూర్తిస్థాయిలో సాగునీరందించి పంటలు ఎండిపోకుండా చూడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.